సాక్షి ప్రకాశం

మంగళవారం । 7 । నవంబర్ । 2023



అర్జీలు పునరావృతం కాకూడదు

స్పందనలో అర్జీలు పునరావృతం కాకూడదని జేసీ కే శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్పందన భవనంలో అర్జీలు స్వీకరించారు. - IIలో..



ఫిర్యాదుల సత్వర పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్పందనలో ఫిర్యాదులు స్వీకరించారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 26.3/24.7

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

● కలెక్టర్లతో సీఎం వైఎస్ జగన్



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్ ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాని, ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ మూర్తి, క్షయ నివారణ అధికారి సురేష్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కిరణ్, డీఐఓ పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు ఒంగోలు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 8న జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కనిగిరిలో నందనమారెళ్ల నుంచి పామూరు బస్టాండు వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి పాల్గొంటారు. అనంతరం 9వ తేదీ మధ్యాహ్నం వరకు ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతోబాటు తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

రేపు ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: అండర్ 17, అండర్ 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ వై.బాలగురవయ్య, సెల్ 8184805547ను సంప్రదించాలన్నారు.

గిద్దలూరు చిత్రకారుడికి గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు



అవార్డు అందుకున్న చంద్రశేఖర్

గిద్దలూరు రూరల్: అనకాపల్లె జిల్లా చోడవరం చిత్రలేఖన నిలయంలో ఈ నెల 5వ తేదీ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పట్టణంలోని బట్టి చంద్రశేఖర్ అనే చిత్రలేఖ కళాకారుడికి గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు దక్కింది. గిద్దలూరులో శేఖర్ ఆర్ట్స్ నిర్వాహకుడు చంద్రశేఖర్ వేసిన చిత్రలేఖనానికి మంచి గుర్తింపు వచ్చి సీసీకేఎస్ సంస్థ వ్యవస్థాపకుడు సూర్యనారాయణ చేతుల మీదుగా అవార్డు పొందాడు. గతంలోను శేఖర్‌కు అంతర్జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రశంసించారు.





బహిరంగ సభా వేదికపై మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున, పక్కన మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, కొలుసు పార్థసారథి, హఫీజ్‌ఖాన్, పార్టీ నాయకులు కాకుమాని రాజశేఖర్, కొమ్మూరి కనకారావు మాదిగ, వేదిక ముందు ఆసీనులైన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, అశేష జనవాహిని

గర్జించిన పురం

సామాజిక సాధికార యాత్రకు జనం వెల్లువలా తరలివచ్చారు. పల్లెల నుంచి అశేష జనవాహిని తరలిరాగా.. బాటలన్నీ జన ఉప్పెనగా మారడంతో మార్కాపురం సమరనాదంతో కదం తొక్కింది. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును తలుచుకుంటూ ఆయనకు జై కొట్టారు. జయహో జగన్ నినాదంతో పట్టణం హోరెత్తిపోయింది. దాదాపు రెండు గంటలపాటు సాగిన పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సభ ముగిసే వరకూ పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. సభ విజయవంతం కావడం నాయకులు, కార్యకర్తల్లో ఫుల్‌జోష్ నింపింది.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయసాయిరెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు



మార్కాపురం పట్టణంలో పాదయాత్రగా వస్తున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగు, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పార్థసారథి, కేపీ నాగార్జునరెడ్డి తదితరులు

తర్లుపాడు: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు అనూహ్య స్పందన లభించింది. సోమవారం ఉదయం నుంచే పార్టీ అధినాయకులు, వివిధ సామాజిక వర్గాల నేతలు తరలి రావడంతో పట్టణమంతా సందడిగా మారింది. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రజలు కార్యకర్తలు నినదించారు. రాజ్యసభ సభ్యుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజినల్ కోర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు పార్థసారథి, కేపీ నాగార్జునరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసుల రెడ్డి తదితర నేతలు పాదయాత్రగా బయలుదేరగా వారి వెంట పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలి వచ్చారు. పురవీధులన్నీ జనంతో నిండిపోయాయి. మధ్యాహ్నం మూడున్నరకు ర్యాలీ ప్రారంభమైంది. పట్టణంలోని డాక్టర్ శామ్యూల్‌జార్జి ఫార్మసీ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి పూలసుబ్బయ్య కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బీసీ భవన్ స్థలం పరిశీలన చేసి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంజమ్మ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి నేతలు, చిల్డ్రన్స్ పార్కు వద్దకు చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ కౌన్సిలర్లతో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతనంగా నిర్మించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు మంత్రులు ఎమ్మెల్యే కేపీతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి బయలుదేరి కంభం సెంటరులో నూతనంగా నిర్మిస్తున్న షాదీఖానాకు చేరుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్, కౌన్సిలర్ సిరాజ్, ఉస్మాన్ ఆధ్వర్యంలో మంత్రులకు ఘనస్వాగతం పలికారు. మతపెద్దలతో కలిసి ప్రత్యేక దువా నిర్వహించారు. అనంతరం పాతబస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభకు చేరుకున్నారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆదిమూలపు సతీష్, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, తర్లుపాడు మండల అధ్యక్షులు భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఇందిర హనుమారెడ్డి, పార్టీ కన్వీనర్ మురారి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయ రెడ్డి, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, పొదిలి నాయకులు కే సుబ్బారెడ్డి, జీ చెన్నారెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మార్కాపురం ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ గురవయ్య, పార్టీ నాయకులు ఉత్తమ్‌కుమార్, కే చెన్నకేశవులు, సతీష్ పాల్గొన్నారు.

ఘనస్వాగతం:

మార్కాపురం రూరల్: సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం మార్కాపురానికి వచ్చిన ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు సురేష్, నాగార్జున, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పార్థసారథి, జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు నాయకులు గజమాలలతో స్వాగతం పలికారు. పట్టణ శివార్లలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వారిని సాదరంగా ఆహ్వానించి తీన్మార్ డప్పులతో సభాప్రాంగణానికి తీసుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారితో పాటు ఇతర వర్గాల ప్రజలతో సభా గ్యాలరీ నిండిపోవడంతోపాటు ప్రజలు, కార్యకర్తలు బయట నిలబడి చివరి వరకూ మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలు విన్నారు.

ఆత్మగౌరవాన్ని తెలిపేందుకే యాత్రలు

● మంత్రులు నాగార్జున, సురేష్, ఎమ్మెల్యే కేపీ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, పక్కన విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: సామాజిక సాధికార యాత్ర రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో ఒకేసారి నిర్వహిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. దేశ చరిత్రలోనే అనేక మంది సామాజిక విప్లవం కోసం ఉద్యమాలు చేశారన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ నుంచి జ్యోతిబాపూలే, మౌలానా అబ్దుల్ కలాం లాంటి ఉద్దండుల సామాజిక విప్లవం ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు విరాజిల్లుతోందన్నారు. సోమవారం శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిలతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నేరుగా కుల ప్రస్తావన తీసుకొచ్చి ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని, బీసీలు జడ్జీలుగా పనికిరారని, బీసీల అంతుచూస్తాం అంటూ విమర్శించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బతకడానికి భయపడాల్సిన పరిస్థితి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో నెలకొందన్నారు. రూ.లక్షల కోట్లను డీబీటీ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో జమచేశారన్నారు.

2 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తే అందులో 78 శాతం మైనార్టీ వర్గాల వారికి వచ్చాయన్నారు. ఇళ్లులేని వారికి ఇళ్ల అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. రూ.400 కోట్లు ఖర్చుపెట్టి రూ.100 కోట్లు విలువచేసే స్థలంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గొప్ప ఆలోచన అన్నారు. కాబినెట్‌లో కులగణన నిర్ణయం చారిత్రాత్మకమైనదని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. మైనార్టీలకు ప్రాధాన్యతను ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌వెంట మనమందరం కలిసి నడవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు దొంగలముఠా ప్రయత్నిస్తోందని వారికి బుద్ధిచెబుతామని, ఆ పార్టీ నాయకులను కూడా ఓడగొడదామని అన్నారు. పేదరికంలో పుట్టిన ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని, ఎక్కడికెళ్లినా సామాజిక న్యాయం, సాధికారతతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో నా ఎస్సీ, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలంటూ అక్కున చేర్చుకుని సాధికారత అంటే ఏమిటో తెలిసేలా చేశారని అన్నారు. సమాజంలో ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఎదుర్కొంటున్న బాధలు తెలుసుకుని అనేక పథకాలతో అందరికీ సంక్షేమం అందించారని అన్నారు. 2019లో రూ.5 కోట్ల మంది ప్రజలను ఒక్క అవకాశమివ్వమని అడిగినప్పుడు జగనన్నను గెలిపించి ప్రజలందరూ గొప్పనిర్ణయం తీసుకున్నారని, ప్రజలందరికీ సాధికారత సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఏ పార్టీ వారైనా సంక్షేమంపైనా, అభివృద్ధిపైనా చర్చించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. మహిళలకు సాధికారత ఇచ్చినప్పుడే అభివృద్ధి అని అది జగనన్న ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు సాక్షాత్తు న్యాయస్థానం ముందే అబద్ధాలు చెప్పారనీ, నాలుగు వారాలు బెయిల్ ఇస్తే వైద్యశాలలో చేరితే మీ ఆరోగ్యం అంతా బాగుందనీ, ఏ అవయవాలకు ఇబ్బందిలేదని వైద్యులు పరిశీలించి రెండు రోజుల్లోనే డిశ్చార్జ్ చేశారని విమర్శించారు. రాజమండ్రి జైలు నుంచి విజయవాడకు కాన్వాయ్‌తో ఏ విధంగా ఊరేగింపుగా వచ్చారో అందరికీ తెలుసన్నారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు అబద్ధాలు ఆడి, బెయిల్ వచ్చేలా ప్రయత్నించాడో తెలుసన్నారు. స్థూల ఉత్పత్తిలో చంద్రబాబు హయాంలో 22వ స్థానంలో ఉందని, ప్రస్తుతం దేశంలోనే 3వ స్థానంలో రాష్ట్రం ఉందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. గతంలో రాష్ట్రంలో 9 మెడికల్ కళాశాలలు ఉంటే జగనన్న ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. అందులో భాగంగా మార్కాపురంలో కూడా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈబీసీ నేస్తం సందర్భంగా ఏప్రిల్ 12న మార్కాపురానికి వచ్చి కొన్ని ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారన్నారు. అందులో భాగంగా పొదిలి పెద్దచెరువు, మార్కాపురం నియోజకవర్గంలో 14 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సాగర్ నీటిపైపు పనులకు నిధులను మంజూరు చేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి పెద్దపీట వేసి 50 శాతం రాజకీయంగా, వివిధ పదవుల్లో అవకాశం కల్పించారని అన్నారు. మార్కాపురంలో సామాజిక సాధికార యాత్ర జరగడం, విశేషంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, సిరాజ్, హర్షిత, రంగలక్ష్మీ, నగేష్, ఎం శ్రీనివాసులు, కే కృష్ణ, షెక్షావలి, ఇన్‌చార్జిలు ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జి.చెన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ప్రాధాన్యత

● వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎస్‌సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని సామ్యూల్‌జార్జి ఫార్మసీ కళాశాలలో సోమవారం మేధావులు, వైద్యులు, టీచర్లు, లాయర్లతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కుల గణన నివేదిక ప్రకారం ఆయా సామాజిక వర్గాల ప్రజలకు లభించే ఆర్థిక, రాజకీయ, సామాజిక లాభాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 1950 వ సంవత్సరంలో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు, వారి ఆర్థిక అసమానతలను తెలుసుకునేందుకు కాలెగ్కర్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కమిటీ నివేదికను సమర్పించగా నాడు అమలుకు నోచుకోకపోవడంతో మరుగున పడిందని చెప్పారు. అనంతరం 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక బీపీ మండల్ ఆధ్వర్యంలో మండల కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడేళ్ల పాటు వివిధ కోణాల్లో కులగణన చేపట్టి 1980లో సంపూర్ణ నివేదిక అందజేయగా ఆ కమిటీ నివేదిక కూడా అనేక కారణాలతో మరుగున పడిందన్నారు. వీపీ సింగ్ ప్రధానమంత్రి అయిన తరువాత మండల కమిషన్ రిపోర్టును అమలు చేయాలని నిర్ణయం తీసుకోగా అప్పుడు కొందరు అమలుచేయాలని, మరికొందరు వద్దని వాదోపవాదాలు జరిగాయన్నారు. నాటి జనాభా ప్రకారం రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ఎస్సీలకు 15, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో బీసీలు జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలనే ఆదేశాలతో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నాటి ముఖ్యమంత్రులు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇటీవల బీహార్‌లో కులగణన చేసినప్పుడు బీసీలు 55 శాతం ఉంటే ఓబీసీలు అధిక శాతం ఉండటంతోపాటు 80 శాతం వ్యవసాయ, ఇతరత్రా భూములు వారి చేతిలో ఉన్నట్లు ప్రభుత్వం గ్రహించిందన్నారు. ఈ విషయంపై కలకలం రేకెత్తిన సంగతి మీకు తెలుసన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 51,455 మంది బీసీలు రూ.418 కోట్లు, 29,463 మంది ఎస్‌సీలు రూ.229 కోట్లు, 2,229 మంది ఎస్టీలు రూ.16 కోట్లు, 3,036 మంది మైనార్టీలు రూ.26 కోట్లు లబ్ధిపొందారని చెప్పారు. మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 86,183 మంది లబ్ధిదారులకు గాను రూ.689 కోట్ల నగదును కులాల వారీగా ఎటువంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డీబీటీ పద్ధతి ద్వారా జమ చేశారన్నారు.

అభివృద్ధి..సంక్షేమం సమపాళ్లలో..

2024 ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధి రెండూ కలిపి మానిఫెస్టో తయారుచేసి ముందుకెళ్లేలా సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నాడు–నేడు ద్వారా వేలకోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యను అందిస్తున్నారన్నారు. వైద్యం కోసం ప్రైమరీ హెల్త్ సెంటర్లతోపాటు రాష్ట్రంలో నూతనంగా 17 వైద్య కళాశాలలను ఏర్పాటుచేసి పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యం కోసం సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయనీ, పాఠశాలలు, వైద్యశాలల ఏర్పాటు అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు.



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

కార్పొరేట్ వైద్యం మార్కాపురంలో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్కాపురానికి మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభమై ఎక్కువ మంది వైద్యులు రావడంతో పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్ అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని అన్నారు.

గ్రామస్వరాజ్యం తెచ్చిన ఘనత సీఎందే

రాష్ట్రంలో గాంధీజీ కలలుగనన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎన్ శ్రీనివాసులు అన్నారు. నాడు–నేడు ద్వారా రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్యతోపాటు అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద తదితర పథకాల ద్వారా విద్యను అందిస్తున్నారన్నారు. బీసీ సాధికారతతో ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు ఎంతో అభివృద్ధి చెంది తలెత్తుకుని జీవిస్తున్నారన్నారు. కులగణన ద్వారా వారి అభివృద్ధికి కృషిచేసేలా కాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పదన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్



పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, నగర అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్ సంక్షేమ రథ సారథి అని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి సీఎం వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర ద్వారా పేద ప్రజల కష్టాలను స్వయంగా చూసి వారి కష్టాలను తొలగించేందుకు సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున సీఎం ప్రారంభించారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు మాట్లాడుతూ కష్టం ఏదైనా తాను భరిస్తూ చిరునవ్వుతో ప్రజలకు ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలన దేశం మొత్తం ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, సాంస్కృతిక విభాగం, మహిళా విభాగం రీజినల్ కోఆర్డినేటర్లు బొట్ల సుబ్బారావు, బడుగు ఇందిర, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆగ్రోస్ రాష్ట్ర డైరెక్టర్ పురిణి ప్రభావతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ పెద్దిపోగు కోటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు రాయపాటి అంకయ్య, కొమ్మూరి రవిచంద్ర, ఘంటా రామానాయుడు, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసరావు, వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఒంగోలు సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, మద్దిపాడు మండల అధ్యక్షుడు మండువ అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, బైరెడ్డి అరుణ, రాజేశ్వరి, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ మీరావలి, నగర కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ స్పందనకు 91 అర్జీలు
- అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ మలికాగర్గ్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఎస్పీ స్పందనకు 91 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీలను స్వయంగా స్వీకరించిన ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అర్జీల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలతో పాటు ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్)ఎస్‌వి.శ్రీధర్ రావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మైనార్టీ సంక్షేమాధికారి

ఒంగోలు: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా డాక్టర్ ఎ.సునీల్ కన్నా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తదనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మైనార్టీలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

- స్పందనలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



స్పందనలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందచేసిన అర్జీల తాలూకు సమస్యలు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్పందన భవనంలో సోమవారంస్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్‌కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలన్నారు.

నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన సీహెచ్ పద్మ డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్‌చేసి సర్వే నెంబర్ 1102లో 54సెంట్ల భూమి ఉందని అయితే 48 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేసారని మిగిలిన భూమి కూడా ఆన్‌లైన్‌చేయాలని కోరారు.

■ తర్లుపాడు మండలం పూతలపాడు గ్రామానికి చెందిన కాశయ్య తాను జలకళ పథకం కింద బోరు వేసినా సామగ్రి ఇవ్వలేదని, పరిశీలించి ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

■ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు మోటే భాస్కర్ ఇతర సభ్యులు పోతులూరి శ్రీబ్రహ్మాచార్యులు, అజీజ్, శ్రీదేవి, శేషమ్మ, గోవింద్, వెంకటేశ్వర్లు తదితరులు స్పందన అధికారులను కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు అన్యాయం జరిగిందని వెంటనే మహిళా రిజర్వేషన్‌లు ఓబీసీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం కోటా కల్పించేలా చట్ట సభల్లో సవరణ బిల్లుపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

సీఎస్‌పురం (పామూరు): కనిగిరిలో ఈ నెల 8న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య అధ్యక్షతన పార్టీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. నవరత్నాలతో దాదాపు 60 నుండి 70 శాతం దాకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు లబ్ధి పొందారన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రతి పేదవాని గడపకు అందాయని, ప్రతి ఇంటికి రూ.లక్ష మొదలుకుని రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మంత్రి పదవులతో పాటు, నామినేటెడ్ పోస్టుల్లో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర 8వ తేదీ ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని నందనమారెళ్ల వద్ద ప్రారంభమవుతుందని అక్కడి నుంచి పలు చోట్ల కార్యక్రమాలు, ముఖాముఖిలు నిర్వహిస్తూ సాయంత్రం 4 గంటలకు కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, యూత్ మండల అధ్యక్షుడు యం.అటేలయ్య, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్‌బుజ్జి, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్లా చిరంజీవి, సర్పంచ్‌లుబ, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ విజేతలు వైఎస్సార్ కడప, శ్రీకాకుళం జట్లు



బాలకల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిన ప్రకాశం జట్టు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతగా బాలుర విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు, బాలికల విభాగంలో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేశాయి. 67వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు ప్రకాశం జిల్లా ఆతిథ్యం బాగుందని కితాబిచ్చారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన క్రీడా దుస్తులు, ట్రోఫీలు అందించిందని, తద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో స్పష్టమైందన్నారు. సాఫ్ట్‌బాల్ అంతర్‌జిల్లాల నిర్వాహక కార్యదర్శి శివశంకరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లకు భోజన సదుపాయం కల్పించేందుకు విద్యాశాఖ రూ.3 లక్షలు వెచ్చించడం అభినందనీయమంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఈటీ సంఘ కార్యదర్శులు నత్తల కృష్ణ, వై.శీనయ్య, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

పోటీల విజేతలు వీరే..

బాలుర విభాగం : వైఎస్సార్ కడప(ప్రథమ స్థానం), శ్రీకాకుళం(ద్వితీయ), విజయనగరం(తృతీయ)

బాలికల విభాగం : విజయనగరం(ప్రథమ స్థానం), వైఎస్సార్ కడప(ద్వితీయ), ప్రకాశం (తృతీయ స్థానం)

సుపరిపాలనకు సర్వ జన సమ్మతం

సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం మార్కాపురం చేరుకున్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం స్థానికంగా పాదయాత్ర చేపట్టింది. పట్టణంలో బీసీ భవన్, అంబేడ్కర్ భవన్, షాదీఖానా వద్ద పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలను రాష్ట్రంలోని అన్ని వర్గాలు హర్షిస్తున్నాయని పేర్కొన్నారు.



బీసీ భవన్ వద్ద పూజల్లో పాల్గొన్న విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు బాలినేని, నాగార్జునరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు



అంబేడ్కర్ భవన్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి



షాదీఖానా వద్ద దువాలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- బాణసంచా విక్రేలతకు ఎస్పీ మలికగర్గ్ స్పష్టీకరణ
- ఒంగోలు, టంగుటూరులో గోడౌన్లు, తయారీ కేంద్రం తనిఖీ



ఒంగోలులో గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్/టంగుటూరు: బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికగర్గ్ హెచ్చరించారు. సోమవారం ఒంగోలు నగరంలోని పలు గోడౌన్లను, టంగుటూరులోని బాణసంచా తయారీ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గోడౌన్లలో ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలను నిరోధించేందుకు నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, తాలూకా సీఐ వి.భక్తవత్సలరెడ్డి, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్సై ఖాదర్‌బాషా, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వైద్యారోగ్య శాఖ భవనాలు వేగంగా నిర్మించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వైద్యారోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో వైద్యారోగ్య శాఖ భవనాల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నాడు-నేడులో భాగంగా నాబార్డు నిధులతో చేపట్టిన 9 రకాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలను వెంటనే ప్రారంభించాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్కాపురం మెడికల్ కాలేజీలో సెప్టెంబర్‌లో అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రాధాన్యత కలిగిన ఐదు రకాల భవనాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఒంగోలు జీజీహెచ్‌లో పీజీ సీట్లు పెరిగిన నేపథ్యంలో రూ.94 కోట్లతో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. అదే విధంగా రూ.23.75 కోట్లతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. రూ.50 కోట్లతో నాబార్డు నిధులతో దోర్నాలలో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ విజయభాస్కర్, డీసీహెచ్ఎస్ మూర్తి, రిమ్స్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏవైరావు, డీఈలు క్రాంతికిరణ్, రవికుమార్, రత్నం, జేఈఈలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ బోల్తా

- బస్తాలు మీద పడి ఒక కూలీ అక్కడికక్కడే మృతి
- మరో ముగ్గురికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలు
- కొండపి మండలం తాటాకులపాలెం మలుపు వద్ద ఘటన



తాటాకులపాలెం మలుపు వద్ద బోల్తా పడిన లారీ



మృతి చెందిన రామహనుమాన్

కొండపి(సింగరాయకొండ): రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి కొండపి మండలం తాటాకులపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తి సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచి కొండపి మండలంలోని నెన్నూరుపాడు, తాటాకులపాలెం, జాళ్లపాలెం, కోయవారిపాలెంలోని రేషన్‌షాపులకు బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు లారీ బయలుదేరింది. నెన్నూరుపాడులో బియ్యం దింపిన తర్వాత తాటాకులపాలెం వెళ్తుండగా అదే గ్రామ సమీపంలోని మలుపు వద్ద లారీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్లో బోల్తాపడింది. ప్రమాద సమయంలో లారీలో ఎనిమిది మంది కూలీలు ఉన్నారు. బియ్యం, గోధుమపిండి, రాగిపిండి, బెల్లం బస్తాలు కూలీలపై పడటంతో రామహనుమాన్ అనే వ్యక్తి ఊపిరాడక అక్కడికక్కడే మరణించాడు. మిగిలిన ఏడుగురు కూలీల్లో తీవ్రంగా గాయపడిన ముండ్లమూరు వాసి అజిత్, చీమకుర్తి వాసి వెంకట నర్సయ్య, అంజయ్యను కొండపి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మరో నలుగురు కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. లారీలో 128 బస్తాల బియ్యం, 350 కేజీల గోదుమ పిండి, 22 బస్తాల రాగి పిండి, 22 బస్తాల బెల్లం ఉన్నాయని, రాత్రి కురిసిన వర్షానికి మొత్తం తడిసిపోయాయని తహసీల్దార్ సింగరావు తెలిపారు. మృతుడు రామహనుమాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.నాగరాజు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని చెప్పారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావోపాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ షకీబ్


అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.